క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో కాలువలు, రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి శుక్రవారం భూమిపూజ చేశారు. రూ. 170 కోట్లతో రోడ్లు, కాలువలు నిర్మించనున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. రమేష్, దాసరి రాజు పాల్గొన్నారు.

వర్షంతో హర్షం



కంచిలిలో కురుస్తున్న వర్షం

కంచిలి: మండలం వ్యాప్తంగా శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం వేళల్లో వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. అదేవిధంగా రెండో పూట కొంత సమయం పాటు కురిసిన వర్షంతో కాలువల్లోని చెత్త రోడ్ల మీదకు చేరింది.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై లోవరాజు

సోంపేట: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సోంపేట ఎస్సై వి.లోవరాజు అన్నారు. స్థానిక వివేకనంద పాఠశాలలో విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో కాశీబుగ్గ సాయికాలనీ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. 14 ఏళ్ల విభాగంలో చెస్‌లో జి.శ్రీనిధి, ఎల్ ఆదిత్య, బ్యాడ్మింటన్‌లో వి.వంశీ, ఖోఖోలో ఆర్.ధర్మేంద్రలు ప్రతిభకనబర్చి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు డి.కళ్యాణి, వ్యాయామ ఉపాధ్యాయులు సి.హెచ్.ఆర్.రామ్‌జీ, తిరుమల, ఎస్‌ఎంసీ చైర్మన్ వరలక్ష్మి అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సోంపేట: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం చూపిస్తున్న మొండి వైఖరికి నిరసన తెలియజేస్తూ వారం రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ బి. అప్పలస్వామికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. సంఘ మండల అధ్యక్షులు ఎ.డిల్లీ రావు, జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్ పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

పలాస: కాశీబుగ్గలోని మేధా డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం పది గంటలకు 'ఉద్దానం అభివృద్ధి ప్రణాళిక 'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక తరఫున జుత్తు సింహాచలం, పాలవలస ధర్మారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్దానం అభివృద్ధి కావాలంటే ఏమి చేయాలనే విషయాలపై ఈ సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

సంతబొమ్మాళి: నర్సాపురం పంచాయతీ ఆకులసతివాణిపేట గ్రామానికి చెందిన ఇచ్ఛాపురం యోగి కొద్ది రోజులుగా బోన్ మరో డిప్రెషన్‌తో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న వల్లేవలసకు చెందిన మనబడి అసోసియేషన్ సభ్యులు పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేసి అండగా నిలిచారు. అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, ఆనంద్ షణ్ముఖ ఉన్నారు.

ముగిసిన క్రీడలు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం ఉన్నత పాఠశాలలో రెండు రోజులు జరిగిన మండల సమాఖ్య క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో 240 మంది విద్యార్థులు పాల్గొనగా 64 మంది ఎంపికయ్యారని ఎంఈవో కురుమాన అప్పరావు తెలిపారు. వీరు ఈనెల 15, 16 తేదీల్లో పలాసలో జరగనున్న డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

వాగు.. దాటి వెళ్తేనే పంటసాగు!





నడిమి గెడ్డ నుంచి పంట పొలాలకు వెళ్తున్న రైతులు

- రైతులకు ఇబ్బందిగా వాగులు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అందులోనుంచే పయణం
- సకాలంలో పనులు కాక.. తగ్గుతున్న దిగుబడి
- అమలుకాని నాయకుల హామీలు



రైతులను భయపెడుతున్న భీమసముద్రం గెడ్డ



కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న ధర్మపురం గెడ్డ

ఇచ్ఛాపురం రూరల్: రైతులకు వివిధ కష్టాలు పలకరిస్తుంటాయి. సకాలంలో విత్తనాలు అందక, ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఇచ్ఛాపురం మండలంలోని కొన్ని గ్రామాల రైతులకు వాగుల కష్టాలు వెంటాడుతున్నాయి. బూర్జపాడు, ఇన్నేశుపేట, మండపల్లి గ్రామాల రైతులు సాగు పనులు ప్రారంభించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగులు దాటాల్సిన పరిస్థితి. బూర్జపాడు పంచాయతీకి చెందిన రైతులు పంటలు పండించాలంటే నడిమి గెడ్డ, నాసి గెడ్డలను దాటుకొని వెళ్లాలి. ఈ గెడ్డలు అవతల ఈ పంచాయతీకి చెందిన రైతుల భూములు 800 ఎకరాల వరకు ఉంది. ఇన్నేశుపేట గ్రామం గుండా ప్రవహించే పద్మపురం గెడ్డ అవతల వెయ్యి ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, మండపల్లి గ్రామానికి సంబంధించి భీమసముద్రం గెడ్డ అవతల 500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒడిశాలో వర్షం కురిసినా, ఆంధ్రాలో వర్షం పడినా బహుదానదిలో వరద నీరు చేరిందంటే చాలు ఈ గెడ్డలు ఉప్పొంగి పారుతుంటాయి. గతంలో వాగులు దాటుతున్న సమయంలో పలుమార్లు వ్యవసాయ కూలీలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. ఎరువులు, కూలీలను పంట పొలాలకు తీసుకువెళ్లడానికి తిప్పలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో వాగులు గుండా ప్రవహించే సాగునీటినే నమ్ముకొని రబీ కాలంలో అంతంత మాత్రంగానే పంటలు పండించే రైతులు ఖరీఫ్‌లో పంటను పండించాలనే ఆతృతతో ప్రమాదాలబారిన పడుతున్నారు.

వంతెన నిర్మాణం.. వినతులకే పరిమితం

బూర్జపాడుకు చెందిన నడిమి గెడ్డ, నాసిగెడ్డలపై మినీ వంతెన నిర్మించాలని నాయకులు, అధికారుల దృష్టికి రైతులు ఏటా తీసుకెళ్తున్నా పరిష్కారం కావడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పని సరిగా వంతెన నిర్మిస్తానంటూ జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు దాసరి రాజు వచ్చి హామీ ఇచ్చారని, దీంతో ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించినప్పటికీ తమకు మేలు జరగలేదని, ఇచ్చిన హామీని సైతం మర్చిపోయారని బూర్జపాడు రైతులు చెబుతున్నారు. ఇన్నేశుపేటలో ప్రవహిస్తున్న పద్మపురం గెడ్డ అధికంగా వర్షాలు కురిసే అక్టోబర్ నెలలో గ్రామాన్ని సైతం ముంచేస్తుంది. గెడ్డ అవతల పంట పొలాలు ఉండటంతో దశాబ్దాల క్రితం నిర్మించిన కాజ్‌వే మాత్రమే రైతులు రాకపోకలకు ఉపయోగపడుతోంది. అయితే ఈ కాజ్‌వే క్రిందకు ఉండటంతో పాటు మరమ్మతుకు గురవ్వడంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నూతన కాజ్‌వే నిర్మాణానికి సమన్వయకర్త పిరియా విజయ అంచనా విలువలతో ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిర్మాణానికి నోచుకోలేదు. ఇక మండపల్లి పంచాయతీకి సంబంధించి భీమసముద్రం గెడ్డపై వంతెన నిర్మిస్తామంటూ ప్రస్తుత శాసన సభ్యుడు బెందాళం అశోక్ 2016లో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడితో మండపల్లి గ్రామస్తుల సమక్షంలో హామీ ఇచ్చారు. అప్పటికప్పుడే ఇరిగేషన్ శాఖాధికారులతో మాట్లాడి అంచనా విలువలు వేయించారు. దీంతో తమకు మంచి రోజులు వచ్చాయని మండపల్లి రైతులు సంతోషించారు. నేటికి పదేళ్లు దాటినా... ఎంపీ రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా, ఎమ్మెల్యే అశోక్ ప్రభుత్వ విప్‌గా పదవులు పొందినా ఇచ్చిన హామీ మాత్రం భీమసముద్రం గెడ్డలో కొట్టుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ కష్టాలు తీర్చాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నాం



మా గ్రామస్తుల పంట పొలాలు నాసి గెడ్డ, నడిమి గెడ్డ అవతల ఉన్నాయి. బాహుదానది నిండినా, భారీ వర్షం కురిసినా గెడ్డల్లో నీరు చేరి రైతులకు ఆందోళన కలిగిస్తాయి. దుక్కులు దున్నేందుకు కనీసం ట్రాక్టర్ కూడా వెళ్లలేని పరిస్థితి. పంటను తెచ్చుకోవాలంటే పీకల్లోతు నీటి గుండా వెళ్లి తలపై మోపులు తెచ్చి ఇవతల ఒడ్డుకు తీసుకురావాలి. ఒక్కోసారి కూలీలు ప్రమాదల భారిన పడిన ఘటనలు ఉన్నాయి. ప్రాణ భయంతో సగానికి సంగం మంది రైతులు పంటలు పండించకపోవడంతో భూములు నిరుపయోగమయ్యాయి. చాలా ఏళ్లగా బాధలు పడుతున్నాం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మిస్తే రైతుల కష్టాలు తీరినట్లే.

– దున్న గురుమూర్తి, రైతు, బూర్జపాడు

సరస్వతి పూజకు శుభరాట



సోంపేట మండలం లక్కవరం గ్రామంలో నిర్వహించనున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా సరస్వతి పూజకు శుక్రవారం పూజా కమిటీ ఆధ్వర్యంలో శుభరాట వేశారు. వేద పండితులు మంత్రోచ్ఛరలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పూజాకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

– సోంపేట

గ్రామస్తుల శ్రమదానం



కంచిలి మండలం బెల్లుపడ పంచాయతీ పరిధి బిన్నళకొత్తూరు గ్రామస్తులు శ్రమదానం చేసి వీధులను శుభ్రం చేసుకున్నారు. వర్షాకాలం కావడంతో గ్రామం అంతటా పిచ్చిమొక్కలు పెరిగాయి. వీటిని శుక్రవారం శ్రమదానం చేసి తొలగించారు. గ్రామంలోని బడి, గుడి, వీధుల్లో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులంతా స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

– కంచిలి

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



కవిటి మండలంలోని బొరివంక–2 ఎంపీటీసీ సభ్యుడు ఎరిపిల్లి రామయ్య తల్లి కర్ణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం ఇద్దివానిపాలెంలోని వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, స్థానిక సర్పంచ్ గండుపల్లి రమేష్, నేతలు హనుమంతు ధనంజయం పాల్గొన్నారు.

– కవిటి

యూరియా కొరతపై సభ్యుల ఆగ్రహం

- కవిటి మండల సమావేశం



యూరియా కొరతపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ కృష్ణారావు

కవిటి: రైతులకు కావాల్సినంత యూరియా ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిటి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన మండలాభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వరక ఎంపీటీసీ సభ్యుడు పిరియా కృష్ణారావు తదితరులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రైతాంగాన్ని సన్నద్ధంచేసే రైతు సదస్సుల్లో శాస్త్రవేత్తలు ప్రకటించిన యూరియా వినియోగ పరిమాణంపై వ్యవసాయశాఖ అధికారులు ఎందుకు రైతులకు వివరించలేదని ప్రశ్నించారు. నాట్లువేసి 40 రోజులైన తరువాత ఎకరానికి 25 కిలోలు మాత్రమే వాడాలంటూ శాస్త్రవేత్తలు రికమండ్ చేశారని వ్యవసాయ శాఖ అధికారులు సన్నాయి నొక్కులు ఎందుకు నొక్కారు? ఇందులో ఆంతర్యం ఏమిటి? మరి ఇదే శాస్త్రవేత్తలు గడచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ నిబంధన గురించి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. వ్యవసాయనిపుణులు తాజాగా ఏవైనా కొత్త పాఠ్యాంశాలు చేర్చారా అంటూ మండల వ్యవసాయశాఖ అధికారిణి పిరియా శ్రీదేవిని నిలదీశారు. అయితే సభ్యుల ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయారు. సమావేశంలో యూరియా కొరతతోపాటు ఉద్దానం ప్రాజెక్టులో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగుల తొలగింపు, మండలంలో పైలట్ ప్రాజెక్ట్‌గా కన్సీల్డ్ ఎలక్ట్రికల్ వైరింగ్, త్రీఫేజ్ లైనింగ్ తదితర అంశాలపై వాడీవేడిగా చర్చ సాగింది. ప్రభుత్వం రైతులకు కనీసస్థాయిలో కూడా పంట ఎదిగే దశనాటికి యూరియా అందించలేదని ఎంపీటీసీ సభ్యులు పిరియా కృష్ణారావు ప్రశ్నించారు. ఇదే అంశంపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు కూడా స్పందిస్తూ.. సరైన రీతిలో యూరియా అందించలేకపోవడం, ఉద్దానం నీటి పథకంలో ఉన్న ఉద్యోగుల తొలగింపు అంశాల్లో ప్రభుత్వ వైఫల్యాల్ని తీవ్రంగా విమర్శించారు. ఈదుపురం వచ్చిన సీఎం చంద్రబాబు అత్యంత సీనియర్‌గా గొప్పలు చెప్పుకోవడమే తప్పా.. అత్యధికసార్లు ముఖ్యమంత్రిగా ఉండి ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు వంశధార జలాలు అందించి సాగునీటి సరఫరాను నిర్లక్ష్యం చేసిన ఘన చరిత్రకు సాక్ష్యంగా నిలిచారని ఎమ్మెల్సీ రామారావు విమర్శించారు. ఎంపీడీవో త్రినాథ, తహసీల్దార్ మురళీమోహనరావు, మండలపరిషత్ ఏవో శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేయలేరు

- నందిగాం ఎంపీపీ శ్రీరామమూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: టీడీపీ నాయకులు వాస్తవాలు వక్రీకరించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని.. అయితే వీటిని ప్రజలు నమ్మరని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. నందిగాంలో విలేకర్లతో శుక్రవారం మాట్లాడుతూ.. టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉంటూ కూడా రైతులకు యూరియా అందించలేని అసమర్థులని అన్నారు. యూరియా అందుబాటులో ఉందని రెండు నెలలుగా చెబుతున్న అచ్చెన్నాయుడు నేటికీ రైతులకు యూరియా ఎందుకు అందించలేకపోతున్నారని ప్రశ్నించారు. యూరియా కోసం ఎరువుల దుకాణాల వద్ద క్యూలైన్లో వేచి ఉంటున్న రైతులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతుల తరఫున ఇటీవల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలిలో నిర్వహించిన రైతు ర్యాలీకి వచ్చిన రైతులకు, వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులతో అడ్డుకోవాలని చూసిన అచ్చెన్నాయుడుకు రైతుల నుంచి వచ్చిన స్పందన చూసి యూరియా సరఫరాపై మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. ఎరువుల పంపిణీలో టీడీపీ అసమర్థతను, రైతుల పడుతున్న కష్టాలను జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తుంటే చంద్రబాబు, అచ్చెన్నాయుడు అతనిపై తప్పుడు విమర్శలు చేయడం తగదని అన్నారు. 'సాక్షి'మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం సమంజసం కాదని అన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, తమిరె రాజు, బొమ్మాళి గున్నయ్య ఉన్నారు.

ఎరువులను పక్కదారి పట్టించారు

- కోటబొమ్మాళి మండల సమావేశం



ఎరువుల సమస్యను ప్రస్తావిస్తున్న సభ్యులు

టెక్కలి రూరల్: రైతులకు ఎరువులు సరఫరా చేయకుండా కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించిందని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. కోటబొమ్మాళి మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండలాభివృద్ధి కార్యాలయ మందిరంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పలువురు సర్పంచ్‌లు, మండల విప్ బొడ్డు అప్పన్న మాట్లాడుతూ.. కనీసం 20 శాతం ఎరువులు కూడా సరఫరా చేయకుండానే ప్రైవేట్ షాపులకు మళ్లించడం దారుణమని టెక్కలి వ్యవసాయ శాఖ ఏడీ జగన్మోహన్ రెడ్డిని నిలదీశారు. దీనికి ఆయన బదులిస్తూ ఈ ఖరీఫ్‌కు సంబంధించి 16,600 ఎకరాలను గుర్తించామని.. దీనికోసం 1047 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు బదులిచ్చారు. దీంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ గ్రామంలో కూడా ఎరువులు సరఫరా జరగలేదని నిలదీశారు. ఎంపీడీవో కె ఫణీంద్రకుమార్ కలుగజేసుకుని గొడవను సద్దుమనిగించారు. తహసీల్దార్ అప్పలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరావు, మండల ఉపాధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి నోటీస్

సంతబొమ్మాళి: హనుమంతునాయుడుపేటలో సాగునీటి కాలువకు అడ్డంగా మట్టివేసి ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి తహసీల్దార్ హేమ సుందర్‌రావు మరోసారి నోటీసులను శుక్రవారం అందజేశారు. సాగునీటి కాలువ ఆక్రమించి కప్పి వేయడంతో పంటపొలాలు ముంపు బారిన పడ్డాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల ఫిర్యాదుతో పాటు 'సాక్షి' దిన పత్రికలో కథనాలు రావడంతో మొదటిసారి నోటీసులను అందజేశారు. అయిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి పట్టించుకోకపోవడంతో మరోసారి నోటీసులను సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారికి వీఆర్వో ద్వారా అందజేశారు.

టెక్కలిపట్నంలో వైద్య శిబిరం

పలాస: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి దేవి చెప్పారు. టెక్కలిపట్నం గ్రామ సచివాలయంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆమె తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఇంటింటికి సర్వే చేస్తున్నామని ప్రతి ఒక్కరు సహకరించాలని చెప్పారు. పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు ఉన్నాయన్నారు. పాము కాటు ఇంజెక్షన్ కూడా అందుబాటులో ఉందన్నారు. స్థానిక వైద్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోటీల్లో ఆదిత్య విద్యార్థులకు ప్రథమ స్థానం

టెక్కలి: పశ్చిమగోదావరి జిల్లా స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన హ్యాకథాన్ పోటీలలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్రథమ స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. స్మార్ట్ అగ్రికల్చర్ డొమైన్ అనే అంశంపై చేపట్టిన పరిశోధనకు కళాశాలకు చెందిన ఆర్.దుర్గాపవన్‌కుమార్, ఎం.శ్రీనివాస్, కె.అఖిలేష్, జి.అశ్రీత్ తదితర విద్యార్థుల బృందం రూ. 20 వేల నగదు బహుమతి అందుకున్నారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సీఎస్ఈ హెచ్ఓడీ వై.రమేష్ అభినందించారు.

పెద్దతామరాపల్లి ప్రతిభ

నందిగాం: పెద్దతామరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్లాస్టిక్ భూతం లఘునాటికకు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించినట్లు ప్రధానోపాధ్యాయులు బమ్మిడి నాగముకేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కళోత్సవ్–2025లో భాగంగా వమరవల్లి కేంద్రంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థులు థియేటర్ ఆర్ట్స్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు పవన్, రిషికేష్‌భార్గవ్, గణేష్‌లు ప్రదర్శించిన ప్లాస్టిక్ భూతం లఘునాటిక ప్రశంసలు అందుకుందన్నారు.

తల్లిదండ్రుల్లేని పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

నందిగాం: తల్లి లేక తండ్రిలేని ఆడపిల్లలకు వసుధైక కుటుంబం స్వచ్ఛంద సంస్థ ఇస్తున్న నెలవారీ స్కాలర్ షిప్‌లకు దేవళభద్ర ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎల్.గుణశేఖర్ తెలిపారు. సమీరా, సాహితి, జెస్సికా, నీలిమలు స్కాలర్‌కు ఎంపికైనట్టు శుక్రవారం చెప్పారు.

రైతుల కష్టాలు మంత్రికి కనిపించవా?

- మంత్రి అచ్చెన్నాయుడును ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్



టెక్కలి: యూరియా కోసం రైతులు క్యూ కడితే తప్పేమిటి, భోజనాల కోసం క్యూ కట్టినపుడు యూరియా కోసం క్యూ కడితే తప్పేమిటి, యూరియా కోసం రైతులు క్యూ కడుతున్న దానిపై 'సాక్షి'మీడియాల్లో వస్తున్న కథనాలు పూర్తిగా కట్టుకథ అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న వ్యాఖ్యలు వింటుంటే ఆయనకు పూర్తిగా మతిపోయిందని స్పష్టంగా అర్థమవుతోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే..ఇవ్వడం చేతకాని వ్యవసాయ శాఖ మంత్రికి ఏం చేయాలో తెలియక పిచ్చిపట్టి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులపైలేని పోని ప్రేలాపనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. టెక్కలిలో యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలపై 'సాక్షి'మీడియాతో పాటు కూటమి ప్రభుత్వానికి అనుకూల పత్రికల్లో సైతం వచ్చిన కథనాలు అచ్చెన్నాయుడుకు కనిపించం లేదా అని ప్రశ్నించారు. మంత్రి సొంత నియోజకవర్గంలో ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద ఏ ఒక్క రైతు యూరియా కోసం ఇబ్బందులు పడలేదని నిరూపిస్తే.. దేనికైనా సిద్ధమని తిలక్ సవాల్ విసిరారు. మంత్రికి అనుకూలంగా ఉన్న ప్రైవేట్ ఎరువుల డీలర్లకు అడ్డగోలుగా యూరియా బ్లాక్ మార్కెట్ ద్వారా తరలించేశారని పేర్కొన్నారు. ఒక వైపు రైతులకు యూరియా ఇవ్వకుండా మరో వైపు బ్లాక్ మార్కెట్ దందాతో కోట్లాది రూపాయలు అవినీతి చేశారని ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా ఎప్పుడు వస్తుందో స్పష్టంగా తెలియజేయలేని అసమర్థత మంత్రి అని దుయ్యబట్టారు. యూరియా ఇవ్వడం చేతకాక తక్కువ వాడండి, సేంద్రియ వ్యవసాయం చేయండి, యూరియా తక్కువ వాడిన వారికి ప్రోత్సహకాలు ఇస్తామంటూ ప్రకటనలు చేయడం 'పెళ్లి రోజు వంకాయ గుడ్డి'సామెతగా ఉందన్నారు. యూరియా లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులు, టీడీపీ కార్యకర్తలు చేస్తున్న వేధింపులపై రెండు రోజుల క్రితం సాక్ష్యాత్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అర్ధరాత్రి సమయాల్లో వ్యవసాయ సహాయకులు చేసిన ఆందోళన మంత్రికి తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఏ రైతు సేవా కేంద్రానికి రమ్మంటే అక్కడకు వస్తామని.. అక్కడ పూర్తి స్థాయిలో యూరియా ఇచ్చామని నిరూపించగలరా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎక్కడైనా యూరియా కష్టాలు చూశారా అన్నారు.యూరియా ఇవ్వాలని రైతుల కోసం వైఎస్సార్‌సీపీ చేపట్టిన ర్యాలీను అడ్డుకోవాలని తెలిసిన మంత్రికి రైతులకు యూరియా ఇవ్వాలని తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా యూరియా ఇవ్వలేమని చెప్పి ప్రకటన చేయాలని అలా కాకుండా రైతుల్ని మభ్య పెట్టే విధంగా ప్రకటనలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

రాష్ట్ర ఆర్ట్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



జానకీకి బహుమతి అందజేస్తున్న డిప్యూటీ ఈవో విజయకుమారి

కంచిలి: మఠం సరియాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఏపూరి జానకి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన పోటీలను వమ్మరవల్లి డైట్ కాలేజీలో నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చడం ద్వారా రాష్ట్ర ఆర్ట్స్ పోటీలకు అర్హత సాధించిందని ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. చిత్రలేఖనంలో 2–డీ విభాగంలో చక్కని ప్రతిభ కనబర్చి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. వాస్తవానికి ఈమె 2–డీ, 3–డీ విభాగాల్లో పాల్గొంది. ఈ పాఠశాల నుంచి కళా ఉత్సవ్ పోటీల్లో ఈ స్కూల్ నుంచి 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ డ్యాన్స్(ఫోక్), థియేటర్ ప్రదర్శన, మూగ సైగలతో నటన, ఆర్ట్ 2–డీ, 3–డీ, గ్రూప్ సాంగ్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన జానకీకి డిప్యూటీ ఈవో విజయకుమారి బహుమతిని ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్, అధ్యాపక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

హక్కులకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు



టెక్కలిలో యాత్ర చేస్తున్న మాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

టెక్కలి: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం రాజ్యాంగ కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబల్లి అశోక్‌బాబు హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర శుక్రవారం టెక్కలి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం యాత్ర చేపట్టినట్లు వెల్లడించారు. న్యాయవాది దాసరి చెన్నకేశవులు, మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, ప్రతినిధులు జర్జాన బాబూరావు, బసవల ధనుంజయరావు, డీఏ స్టాలిన్, కామేశ్వర్రావు, డిల్లేశ్వరావు, గడ్డెయ్య, కె.రవికుమార్ గాంధీ పాల్గొన్నారు.

☛ పలాస: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తులిబిల్లి అశోక్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా కుప్పంలో ప్రారంభమైన యాత్ర శుక్రవారం పలాసకు చేరింది.

☛ కంచిలి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలని కోరుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వాహకుడు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెన్నకేశవులు చేపట్టిన యాత్ర కంచిలి చేరుకుంది.